మెట్‌పల్లి రూరల్: వెల్లుల్లలో రైతులకు విత్తన కొనుగోళ్లపై అవగాహన కల్పిస్తున్న ఏవో షాహిద్ అలీ

ఇబ్రహీంపట్నం: అమ్మక్కపేటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయాధికారి దీపిక

నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి

- రసీదు తప్పనిసరిగా తీసుకోవాలి
- జిల్లా వ్యాప్తంగా రైతులకు అవగాహన కల్పించిన వ్యవసాయాధికారులు

సారంగాపూర్, మే 25: రైతులు నకిలీ విత్తనాల పట్ల జాగ్రత్తగా ఉండాలని మండల వ్యవసాయాధికారి తిరుపతి నాయక్ సూచించారు. మండలంలోని అర్పల్లి, రేచపల్లి, లచ్చునాయక్ తండా గ్రామాల్లో విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఏఈవోలు ఆంజనేయులు, వెంకటేశ్, రైతులు పాల్గొన్నారు.

రాయికల్, మే 25: రైతులు పంటల సాగుకు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ముక్తేశ్వర్ సూచించారు. మండలంలోని సింగరావుపేట్, శ్రీరామ్‌నగర్, వడ్డెరకాలనీ, చర్లకొండాపూర్, భూపతిపూర్ గ్రామాల్లో రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఏఈవోలు పద్మావతి, రాజేశ్, మత్తాయి, సృజన, తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్, మే 25: రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని ఏడీఏ లావణ్య సూచించారు. మండలంలోని ముత్యంపేట, రాఘవపేట, సంగెం శ్రీరాంపూర్, దామరాజుపల్లి, రేగుంట, సాతారం, గుండంపల్లి గ్రామాల్లో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో ఏఈవోలు గజానంద్, సంధ్య, సాయిప్రియ, నవిత, అనిల్‌కుమార్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం, మే 25: రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి దీపిక సూచించారు. మండలంలోని అమ్మక్కపేట, ఎర్రాపూర్, ఎర్దండి, ఫకీర్‌కొండాపూర్, యామాపూర్ గ్రామాల్లో విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఏఈవోలు నరేశ్, శ్యాంకుమార్, హరీశ్, రవళి, తదితరులు పాల్గొన్నారు.

మల్యాల, మే 25: మండలంలోని మల్యాల, గుడిపేట, ముత్యంపేట, లంబాడిపల్లి, నూకపల్లి, మ్యాడంపల్లి, సర్వాపూర్ గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. వ్యవసాయాధికారి చంద్రదీపక్, ఏఈవోలు కారుణ్యకుమార్, మంజుల, శ్రీనివాస్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి, మే 25: మండల కేంద్రంతో పాటు కాచారం, పోరుమల్ల, భీమారం మండలం మన్నెగూడెం గ్రామాల్లో విత్తనాల ఎంపికపై రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవోలు వంశీ, సురేందర్‌నాయక్, నరేందర్, రచన, రైతులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్, మే 25: రైతులు విత్తనాలు కొనుగోలు చేసే విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఏవో షాహిద్ అలీ తెలిపారు. మెట్‌పల్లి మండలం వెల్లుల్ల, చింతలపేట, మెట్లచిట్టాపూర్, విట్టంపేట, రాజేశ్వర్‌రావుపేట, సత్తక్కపల్లి, ఆత్మకూర్, పాటిమీది తండా, ఆరపేట గ్రామాల్లో రైతులకు విత్తనాల కొనుగోళ్లపై అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఏఈవోలు రాజు, భూమేశ్వర్, సాగర్, వినోద్, మనోజ్ఞ, రైతులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల నియంత్రణకు చర్యలు

- జిల్లా వ్యవసాయాధికారి వాణి
- పెగడపల్లిలో విత్తనాలు, ఎరువుల దుకాణాల తనిఖీ

ఎరువుల వివరాలను ఈ పాస్‌యంత్రంలో పరిశీలిస్తున్న డీఏవో వాణి

పెగడపల్లి, మే 25: జిల్లాలో నకిలీ విత్తనాలు, ఎరువుల నియంత్రణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్, స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి వాణి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలు, స్థానిక సహకార సంఘంతో పాటు బతికపల్లిలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ, దుకాణాదారులు నకిలీ ఎరువులు, విత్తనాలు, లూజ్ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసే విత్తనాలకు సంబంధించి బిల్లులు తీసుకోవాలని సూచించారు. బిల్లులో కంపెనీ పేరు, బ్యాచ్ నంబర్ వంటి వివరాలు ఉండేలా చూసుకోవడంతో పాటు, పంట కోతలు పూర్తయ్యేవరకు భద్రపరుచుకోవాలన్నారు. డీలర్లు కొనుగోళ్లు, అమ్మకాలకు సంబంధించి ప్రత్యేక రిజిష్టర్‌ను నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏవో వినీల పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాల, మే 25: పట్టణంలోని టౌన్-1, 2, 3 ఫీడర్ల పరిధిలో ఆదివారం చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ మెయింటనెన్స్ పనులు చేపడుతున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. రాంబజార్ నుంచి టవర్ వరకు, పురాణిపేట, ఎల్‌జీ రాం లాడ్జీ ఏరియా, న్యూ బస్టాండ్ ఏరియా, బీఎస్‌ఎన్‌లో టవర్ ఏరియా, యావర్ రోడ్డు లెఫ్ట్ సైడ్, ఫైర్ స్టేషన్ నుంచి తహసీల్ చౌరస్తా వరకు, బాలాజీ టాకీస్ ఏరియా, ద్వారకానగర్, కాంతిభవన్ పక్కన (అరవిందనగర్), మార్కెట్ బ్యాక్ సైడ్, శ్రీరాం నగర్ ఏరియాలకు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని టౌన్-1 ఏఈ అశోక్ పేర్కొన్నారు. పాత బస్టాండ్, విద్యానగర్, ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల రోడ్డు, పోచమ్మవాడ, హనుమాన్ వాడ, అన్నపూర్ణ చౌరస్తా, మిషన్ కాంపౌండ్, బ్రాహ్మణ వాడ, ప్రభుత్వ దవాఖాన, తహసీల్ చౌరస్తా, వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంతాలకు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్-2 ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు.

వర్ష బీభత్సం

మల్లాపూర్: రత్నాపూర్‌లో ఈదురుగాలులతో పైకప్పు ఎగిరిపోయిన ఇంట్లో బాధితులు

మల్లాపూర్, మే 25: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శనివారం సుమారు గంట పాటు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో గ్రామాల్లోని చెట్లు విరిగి విద్యుత్ వైర్లపై పడి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మల్లాపూర్‌లో రోడ్డుపై భారీ వృక్షం పడడంతో వాహనాల రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం కలిగింది. రత్నాపూర్ గ్రామంలో బండారి శ్రీనివాస్ ఇంటిపై కప్పు ఈదురు గాలికి పూర్తిగా ఎగిరిపోయింది. మల్లాపూర్‌లోని ఓ ఎరువుల దుకాణంలో మందు బస్తాలను దించుతున్న క్రమంలో జగిత్యాల పట్టణానికి చెందిన మహ్మద్ ఖాదీర్ అనే లారీ డ్రైవర్ పిడుగుపాటుకు గుర్తై గుండెపోటు వచ్చి అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ లచ్చయ్య పరిశీలించి, వివరాలు సేకరించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మేడిపల్లి, మే 25: మేడిపల్లి మండలం దమ్మన్నపేట, భీమారం మండలం దేశాయిపేట గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. దమ్మన్నపేట గ్రామంలో మాకునూరి చిన్న కాశీరాంకు చెందిన రేకుల షెడ్డు లేచిపోయింది. దేశాయిపేటలో తాటి చెట్టు నేలకూలి రెండు మేకలు మృతిచెందాయి. రాగోజిపేటలో తాటిచెట్టుపై పిడుగు పడి మంటలు చెలరేగాయి.

కథలాపూర్, మే 25: గంభీర్‌పూర్ శివారులోని కొచ్చెరువుకు వెళ్లే రోడ్డులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కూలి కిందపడింది. వైర్లు తెగి స్తంభాలు నేల కూలాయి. తాండ్ర్యాల గ్రామంలో రామడుగు పద్మ ఇంటిపై ఉన్న రేకులు గాలికి ఎగిరిపోయాయి.

మహిళల ఆర్థికాభివృద్ధికి సర్కారు తోడ్పాటు

కుట్టు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

- కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా
- యూనిఫాం కుట్టు కేంద్రం సందర్శన

జగిత్యాల/జగిత్యాల అర్బన్, మే 25: మహిళల ఆర్థికాభివృద్ధికి తెలంగాణ సర్కారు తోడ్పాటు అందిస్తున్నదని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా పేర్కొన్నారు. పట్టణంలోని విద్యానగర్‌లో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యూనిఫాం కుట్టు కేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళా సంఘాల సభ్యులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతోనే యూనిఫాంలు కుట్టే బాధ్యతను అప్పగించినట్లు తెలిపారు. స్కూళ్లు ప్రారంభించే సమయానికి ముందుగానే యూనిఫాంలు అందించే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని, అవసరమైతే రోజుకు రెండు షిఫ్టులు కుట్టేలా సభ్యులను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీవో సంపత్ రావు, మెప్మా ఏవో శ్రీనివాస్, డీఎంసీ సునీత, టీఎంసీ రజిత, సీవో రాధ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోపై చర్యలు తీసుకోవాలి

జగిత్యాల అర్బన్, మే 25: జిల్లాలో 104 అంబులెన్సు డ్రైవర్ కొప్పుల రాజ్‌కుమార్ మృతికి కారణమైన డీఎంహెచ్‌వోపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కాయితి శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన 104 సిబ్బందితో కలిసి స్థానిక ప్రభుత్వ దవాఖానలో విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కాయితి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి మెట్టు దాసు, ప్రధాన కార్యదర్శి ఎనుగంటి రాజేశ్, 104 అంబులెన్సు ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాశ్, జిల్లా అధ్యక్షుడు నక్క శేఖర్, భాస్కర్, సరిత, సైఫొద్దీన్, హేమలత, శ్రీలత, లీల పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే చర్యలు

జరిమానా రసీదు అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మెట్‌పల్లి, మే 25: నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా తినుబండరాలను విక్రయిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ మోహన్ హెచ్చరించారు. పట్టణంలోని పలు స్వీట్ హౌస్ దుకాణాల్లో శనివారం కమిషనర్ ఆదేశాలతో సిబ్బంది తనిఖీలు చేపట్టారు. నాణ్యతా ప్రమాణాలను పాటించని రెండు దుకాణాలకు రూ. 500 చొప్పున జరిమానా విధించారు. స్వీట్ హౌస్‌లతో పాటు హోటళ్లు, రెస్టారెంట్లలో నాణ్యతా ప్రమాణాలు, పరిశుభ్రతను విధిగా పాటించాలని, ప్లాస్టిక్ కవర్లను వినియోగించరాదని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో మున్సిపల్ సిబ్బంది ముజిబ్, పున్నం నాయక్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రాకేశ్ రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల, మే 25: రాకేశ్ రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన తూర్పు వరంగల్‌లోని ఖిలా వరంగల్ (35వ డివిజన్)లో గల పద్మశాలీ సేవా సంఘంలో ముఖ్య కార్యకర్తలు, పట్టభద్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్ రెడ్డికి మద్దతుగా ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రవీణ్, ఇన్‌చార్జులు పాలేపు రాజేంద్రప్రసాద్, దావ సురేశ్, నాయకుడు నగేశ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం వరంగల్‌లోని భద్రకాళి ఆలయంలో అమ్మవారిని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు.

అయ్యప్ప ఆలయానికి విరాళం

కోరుట్ల, మే 25: పట్టణంలోని అయ్యప్ప, జ్ఞాన సరస్వతీ ఆలయ అభివృద్ధి కోసం రాఘవేంద్ర రైస్ మిల్లు యజమాని మచ్చ రమేశ్-అన్నపూర్ణ దంపతులు శనివారం రూ. 51 వేల విరాళం అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆలయంలో ప్రహరీ, వసతి గృహం నిర్మాణానికి దాతలు విరాళాలు అందించాలని కోరారు. దాతను ఆలయ కమిటీ పక్షాన సత్కరించారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి రాజు, కోశాధికారి రమేశ్, గౌరవ సలహాదారు మధు, ఉపాధ్యక్షులు ఆనంద్, తులసీకృష్ణ, సహాయ కార్యదర్శి క్రాంతికుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ

జగిత్యాల టౌన్, మే 25: మండలంలోని పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో పంటల్లో జీవన, సేంద్రియ ఎరువుల ప్రాముఖ్యత గురించి షెడ్యూల్డ్ కులాల రైతులకు వ్యవసాయ కళాశాల ఇన్‌చార్జి డీన్ ఝాన్సీ రాణి ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సేంద్రియ, జీవన ఎరువుల వాడకంతో భూసారం కాపాడుకోవాలని రైతులకు సూచించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ సుష్మాదేవి, షెడ్యూల్డ్ కులాల సెల్ అధికారి వేణుగోపాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సాయికుమార్, ఎల్లాగౌడ్, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం అన్‌లోడ్ చేసుకోవాలి

మిల్లులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

వెల్గటూర్, మే 25: కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యం బస్తాలను మిల్లర్లు కొర్రీలు పెట్టకుండా త్వరగా అన్‌లోడ్ చేసుకోవాలని అదనపు కలెక్టర్ రాంబాబు మిల్లర్లను ఆదేశించారు. తప్ప, తాలు పేరుతో కొర్రీలు పెట్టుకుంటూ ఆలస్యం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ హతీరాం, తహసీల్దార్ శేఖర్, ఆర్ఐ రాజేశ్వరి, సిబ్బంది ఉన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ప్రముఖ హాస్పిటల్‌లో పనిచేయుటకు గైనిక్, అనుభవం గల నర్సులు (GNM/B.Sc Nursing) కావలెను. స్వయంగా సంప్రదించండి: పుల్లెల హాస్పిటల్, KNR.
NTK-317429

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

అంజన్న ఆలయంలో భక్తుల రద్దీ

ఆంజనేయ స్వామికి పట్టువస్త్రాలను తయారు చేసే మరమగ్గాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల, మే 25: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వేకువజాము నుంచే నూతన పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో చంద్రశేఖర్, ఏఈవో వైరాగ్యం అంజయ్య ఏర్పాట్లను చేస్తూ సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు సునీల్, ఇన్‌స్పెక్టర్లు జెమిని శ్రీనివాస్, సంపత్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టువస్త్రాల తయారీకి శ్రీకారం

ప్రతి సంవత్సరం హనుమాన్ పెద్ద జయంతికి సికింద్రాబాద్‌లోని గణపతి ఆలయం చైర్మన్, పద్మశాలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ జయరాజ్ నేతృత్వంలో కొండగట్టులోనే ప్రత్యేక మరమగ్గం ఏర్పాటు చేసి పట్టువస్త్రాలను నేసి స్వామి వారికి సమర్పిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మరమగ్గాల వద్ద జయరాజ్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేసి పట్టువస్త్రాలను నేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, రాంలింగారెడ్డి, రాజనర్సింగరావు, శంకర్, మల్లేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల వేతనాల పెంపుపై హర్షం

కోరుట్ల/జగిత్యాల, మే 25: రాష్ట్రంలోని బీడీ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు వేతనాల పెంపుపై పరిశ్రమల యజమానులతో అంగీకారం కుదిరినట్లు బీడీ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి రాములు తెలిపారు. బీడీ మ్యాన్‌ఫాక్చరింగ్ అసోసియేషన్ ప్రతినిధులతో బీడీ కార్మిక సంఘం నాయకులు హైదరాబాద్‌లోని ఓ హోటల్లో వేతనాల పెంపుపై చర్చలు జరిపారు. బీడీ పరిశ్రమల్లో పనిచేస్తున్న నెలసరి ఉద్యోగులకు ప్రస్తుతం ఉన్న వేతనంపై రూ. 1700, ప్యాకింగ్ కార్మికులకు రూ. 3650, బీడీ కార్మికులకు వెయ్యి బీడీలకు వేతనంగా ఉన్న కూలిపై రూ. 4.25 పైసలు చెల్లించుటకు ఒప్పందం కుదిరినట్లు పేర్కొన్నారు. బీడీ కార్మికులకు వేతనాల పెంపుతో ఊరట కలుగనుందని వారు హర్షం వ్యక్తం చేశారు. చర్చల్లో బీడీ పరిశ్రమల యజమానుల సంఘం అధ్యక్షుడు హితేంద్ర ఉపాధ్యాయ, జనరల్ సెక్రటరీ ధర్మేంద్ర గాంధీ, బీడీ ఫ్యాక్టరీల ప్రతినిధులు రశ్మీకాంత్ పటేల్, రామన్ బాయ్, ప్రభాకర్, బీడీ కార్మిక సంఘాల ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులతో పాటూ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మహ్మద్ ముక్రం, రంగారెడ్డి, భానుచందర్ పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

కొడిమ్యాల, మే 25: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీపీ మేన్నేని స్వర్ణలత, ఎంపీడీవో స్వరూప తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉన్నందున వాయిదా వేసినట్లు చెప్పారు.

వానకాలం సాగు ప్రణాళిక ఖరారు

జగిత్యాల టౌన్, మే 25: జిల్లాలో వానకాలంలో 4,34,425 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేయనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. వరి 3,05,000 ఎకరాల్లో, మక్క 41,000, కందులు 2500, పెసర్లు 150, సోయా 600, పత్తి 20,200, చెరుకు 1200, పసుపు 11,000, అలిచింత, అనుములు 675, ఇతర పంటలు 42,100 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు ప్రణాళికను సిద్ధం చేశారు. అలాగే, వరి విత్తనాలు 3,0,5000 ఎకరాలకు గానూ 76,250 క్వింటాళ్లు, మక్క41,000 ఎకరాలకు 3,280 క్వింటాళ్లు, కందులు 2500 ఎకరాలకు 75 క్వింటాళ్లు, పెసర్లు 150 ఎకరాలకు 12 క్వింటాళ్లు, సోయాబిన్ 600 ఎకరాలకు 180 క్వింటాళ్లు, పత్తి 20,200 ఎకరాలకు 40,200 ప్యాకెట్లు అవసరం ఉన్నట్లు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. అలాగే, జూన్ నెలలో యూరియా 36,650 మెట్రిక్ టన్నులు, డీఏపీ 11,747, ఎస్ఎస్‌పీ 4,780, ఎంవోపీ 10,300, కాంప్లెక్స్ 46,100 మెట్రిక్ టన్నులు అవసరం ఉన్నట్లు ప్రభుత్వానికి నివేదిక పంపించారు.

పుస్తకాల పంపిణీ

యువతకు పుస్తకాలు అందజేస్తున్న డాక్టర్ బీఎన్ రావు

జగిత్యాల, మే 25: పట్టణంలోని తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో డాక్టర్ బీఎన్‌రావు హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న 250 మంది యువతకు శనివారం జనరల్ నాలెడ్జీ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఎన్‌రావు మాట్లాడుతూ, యువత శ్రద్ధతో చదివితే పోటీ పరీక్షల్లో రాణిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ స్టడీ సర్కిల్ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

బీరప్ప ఉత్సవాలకు ఎమ్మెల్యే హాజరు

కొడిమ్యాల, మే 25: పూడూర్ గ్రామంలో శనివారం బీరప్ప ఉత్సవాలు నిర్వహించగా, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పోతారం అడవుల్లో చిరుతపులి సంచారం వదంతులు

కథలాపూర్, మే 25: మండలంలోని పోతారం, కలికోట గ్రామాల అడవుల్లో చిరుతపులి సంచరించినట్లు పలువురు గ్రామస్తులకు చెప్పడంతో ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై అటవీశాఖ కథలాపూర్ సెక్షన్ ఆఫీసర్ మల్లేశం మాట్లాడుతూ, చిరుతపులి సంచరించినట్లు వదంతులు రావడంతో పోతారం, కలికోట అడవుల్లో పర్యటించామన్నారు. చిరుతపులి ఆనవాళ్లు కనిపించలేదని, ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు.

చేతి పంపులు ప్రారంభం

పెగడపల్లి/మల్యాల, మే 25: పెగడపల్లి మండలం నంచర్ల ఎస్సీ కాలనీ, ల్యాగలమర్రి, మల్యాల మండలం తాటిపల్లి గ్రామాల్లో కరీంనగర్‌కు చెందిన ఫాతిమానగర్ అడోరేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేతి పంపులను శనివారం సంస్థ సభ్యులు ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో సంస్థ సభ్యులు దీప్తి, ప్రీతి, అరుణ, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశం, రమేశ్, నాయకులు బుర్ర రాములుగౌడ్, అంజయ్య, విష్ణు, లక్ష్మీకాంతం, వెంకటేశం, మర్రి మల్లేశం, నరెడ్డి శ్రీనివాసరెడ్డి, రమేశ్, రూప, స్రవంతి, మౌనిక, ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరికొయ్యలకు నిప్పు

మెట్‌పల్లి రూరల్, మే 25: మెట్‌పల్లి మండలం రామలచ్చక్కపేట-ఆత్మనగర్ గ్రామాల మధ్య రామలచ్చక్కపేట రైతుల పంట పొలాలు ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం ఓ రైతు వరి కొయ్యలను కాల్చేందుకు నిప్పుపెట్టాడు. కాపు కాయకుండా వెళ్లడంతో మంటలు వ్యాపించి రాత్రి వరకు ఆత్మనగర్ శివారులోని నివాసాల వద్దకు చేరాయి. దీంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్దమనుషులు మెట్‌పల్లి అగ్నిమాపక సిబ్బందికి సమాచారమందించారు. వెంటనే శకటంతో ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది స్థానిక మాజీ సర్పంచ్ జరుపుల శ్రీనివాస్, పెద్దమనుషులు భూమేశ్, రమేశ్, శ్రీను, యువకులు భరత్, సన్నీ, శ్యామ్, మనోజ్ సహాయంతో మంటలను అదుపు చేశారు.

సఖీ కేంద్రం సేవలపై అవగాహన

జగిత్యాల రూరల్, మే 25: తిప్పన్నపేట గ్రామంలో శనివారం మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి వాణిశ్రీ ఆదేశాల మేరకు ఉపాధిహామీ కూలీలకు తేజస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సఖీ కేంద్రం సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గౌతమి, ఫీల్డ్ అసిస్టెంట్, కూలీలు పాల్గొన్నారు.

అత్తింటి వారిపై కేసు

సారంగాపూర్, మే 25: మండలంలోని పెంబట్ల గ్రామానికి చెందిన పస్తం భాగ్యకు తొమ్మిదేళ్ల క్రితం జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన జలెంధర్‌తో వివాహం జరిగింది. కాగా, అదనంగా రూ. 50వేలు కట్నం తేవాలని అత్తింటివారు వేధించడంతో ఈనెల 20న తల్లిగారింటికి వచ్చింది. భాగ్య ఫిర్యాదు మేరకు జలెంధర్‌తో పాటు అత్త రాజమ్మపై వరకట్నం వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ దత్తాద్రి తెలిపారు.

రైతులకు అవగాహన

కోరుట్ల రూరల్, మే 25: రైతులు నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని వ్యవసాయాధికారి నాగమణి పేర్కొన్నారు. నాగులపేట, పైడిమడుగు, మోహన్‌రావుపేట గ్రామాల్లో శనివారం రైతులకు విత్తనాల ఎంపికపై అవగాహన కల్పించారు. సహకార సంఘాల అధ్యక్షులు నర్సారెడ్డి, జగన్‌మోహన్‌రావు, ఏఈవోలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కోరుట్ల, మే 25: పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన కాంగ్రెస్ నాయకుడు వినోద్ మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యులను కాంగ్రెస్ నాయకులు శనివారం పరామర్శించారు. ఇక్కడ నాయకులు జువ్వాడి కృష్ణారావు, తిరుమల గంగాధర్, కొంతం రాజం, బలిజ రాజరెడ్డి, పసుల కృష్ణప్రసాద్, మొగిలి, కొండయ్య తదితరులున్నారు.

3న మండల సర్వసభ్య సమావేశం

జగిత్యాల రూరల్, మే 25: జగిత్యాల రూరల్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ మంగళారపు మహేశ్ అధ్యక్షతన జూన్ 3న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల సందడి

ధర్మపురి, మే 25: ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. లక్ష్మీనరసింహస్వామితో పాటు అనుబంధ ఆలయాల్లో స్వామివారలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ సిబ్బంది ర్పాట్లు చేశారు.

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య

జగిత్యాల కలెక్టరేట్, మే 25: జగిత్యాల పట్టణంలోని హనుమాన్‌వాడకు చెందిన అల్లె మల్లేశం(49) భార్య కాపురానికి రావడంలేదని శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు టౌన్ ఎస్‌ఐ నరేశ్ తెలిపారు. మల్లేశం తండ్రి రాజం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు

రాయికల్, మే 25: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు జగిత్యాల రూరల్ సీఐ ఆరిఫ్ అలీఖాన్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత మార్చిలో ఆరు కిలోల గంజాయిని తరలిస్తుండగా, నలుగురిని పట్టుకొని జైలుకు పంపినట్లు తెలిపారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారని, ఇందులో కోరుట్ల పట్టణానికి చెందిన మానాల అక్షిత్, మల్లాపూర్ మండలం వేంపెల్లికి చెందిన మెండె నివేద్‌ను శనివారం పట్టుకొని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఎస్‌ఐ అజయ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కోరుట్ల రూరల్, మే 25: పైడిమడుగు గ్రామంలో తాళం వేసిన ఇంట్లో శనివారం చోరీ జరిగింది. బాధితురాలి కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కల్లెడ రాజేశ్వరి గ్రామంలోని సమీప బంధువుల ఇంటికి శుక్రవారం శుభకార్యానికి వెళ్లింది. రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంట్లో బీరువాలో ఉన్న 5 తులాల బంగారం, రూ. 5 వేల నగదు ఎత్తుకెళ్లారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.

ఈత చెట్లు దగ్ధం

ఇబ్రహీంపట్నం, మే 25: మండల కేంద్రం శివారులో శనివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని సుమారు 2500 ఈత చెట్లు దగ్ధమయ్యాయి. ప్రభుత్వం ఆదుకోవాలని గీత కార్మిక సంఘం నాయకులు సత్యనారాయణగౌడ్, సాయిరాం గౌడ్ కోరారు.

పిచ్చికుక్క స్వైర విహారం

జగిత్యాల రూరల్, మే 25: మోతే గ్రామంలో శనివారం పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. 7 బర్రెలతో పాటు ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడిపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి.